సాక్షి రంగారెడ్డి

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



వ్యతిరేక విధానాలపై పోరు

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



కార్మిక వర్గాలకు అన్యాయం

కేంద్ర బడ్జెట్ వ్యవసాయ, శ్రామికవర్గాలకు వ్యతిరేకంగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆరోపించారు. 8లో▸



దాహార్తి తీరేలా..

నగర దాహార్తి తీరుస్తున్న గండిపేట నుంచి మరో పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని తరలించేందుకు కసరత్తు జరుగుతోంది. 8లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6న ఉదయం 10.30 నుంచి 2.30 గంటల వరకు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రిటైల్, ఈ కామర్స్, బ్యాంకింగ్, బీపీఓ రంగాల్లో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ డిప్లమా పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్ల లోబడి ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, శాంతినగర్ మల్లేపల్లిలో హాజరుకావాలన్నారు. వివరాలకు 99634 93453, 90630 99306 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు



బాలకిషన్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హుడాకాంప్లెక్స్: నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయలేరని తెలంగాణ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ అన్నారు. తెలంగాణ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం సరూర్‌నగర్ పోలీసులు బాలకిషన్‌ను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొందరి కుట్రలకు తలొగ్గి, ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెడుతున్నాయని ఆరోపించారు. మాలలను ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన ఖండించారు.

అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ అధ్యాపకుడు



సింగపూర్‌కు చేరుకున్న రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సింగపూర్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు షాద్‌నగర్‌కు చెందిన అధ్యాపకుడు సామ రవీందర్‌రెడ్డి మంగళవారం సింగపూర్‌కు చేరుకున్నారు. సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రతినిధి ప్రొఫెసర్ థాం షాంగైను అక్కడి ఎయిర్‌పోర్టులో కలుసుకున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో దేశం తరపున 'అర్బన్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ క్లైమేట్ మిటిగేషన్' అంశంపై రాసిన పరిశోధన పత్రాన్ని ప్రజెంట్ చేయనున్నారు. భారతదేశం ప్రస్తుతం వాతావరణంలో మార్పును ప్రధాన సమస్యగా ఎదుర్కొంటోందని, ఈ సమస్యను అధిగమించి అభివద్ధి చెందే విధంగా ప్రజెంటేషన్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉందని రవీందర్‌రెడ్డి తెలిపారు.

దుర్గమ్మసేవలో 'పట్నం' న్యాయమూర్తి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను ఇబ్రహీంపట్నం ఏడవ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రీటాలాల్ చంద్ దంపతులు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి కుంకుమ అర్చన, అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం న్యాయమూర్తి దంపతులను ఆలయ అధికారులు సత్కరించారు.

విద్యుత్ అధికారులతో ఎస్ఈ సమీక్ష



మాట్లాడుతున్న ఎస్ఈ రామ్మోహన్

షాద్‌నగర్: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని ట్రాన్స్ కో ఎస్ఈ రామ్మోహన్ సూచించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించారు. గ్రామాలు, పట్టణంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే గుర్తించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయానికి, గృహ, వ్యాపార సముదాయాలకు అవసరమైన కరెంటు సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీఈలు సత్యనారాయణ, రవీందర్, ఏఈ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురం.. 'కొత్త' రాజకీయం

మున్సిపల్ పరిధిలో విలీనమైన ఆయా గ్రామాలు

- చేవెళ్ల, మొయినాబాద్‌లో మారనున్న సమీకరణాలు
- పెరగనున్న పదవుల అవకాశాలు
- 'స్థానిక' సమరంలో కనిపించనున్న మార్పులు



చేవెళ్ల: కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుతో అభివృద్ధితోపాటు రాజకీయంలోనూ పలు మార్పులు రానున్నాయి. నిన్నటి వరకు మండల కేంద్రాలుగా ఉన్న చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలుగా మారడంతో ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకులంతా మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్ పదవులకోసం పోటీ పడాల్సి ఉంటుంది. ఇన్నాళ్లు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలుగా పోటీ పడిన వారంతా ఈ పదవులకు దూరం కానున్నారు. మండల కేంద్రాల్లో ఉన్న నాయకులే మండలంలోని ప్రధాన పదవులను దక్కించుకుని రాజకీయం చేసేవారు. గ్రామాల్లో ఉండే నాయకులు తమకు అవకాశాలు రావడం లేదనే నిరాశలో ఉండేవారు. అలాంటి వారికి మున్సిపాలిటీల ఏర్పాటుతో అవకాశాలు దక్కనున్నాయి. మండల నాయకులు మున్సిపాలిటీ పదవులపై దృష్టి సారిస్తే మండల ప్రజాప్రతినిధులుగా గ్రామాల్లో ఉండే నాయకులకు అవకాశాలు రానున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఉన్న పలు పార్టీల నాయకులు ఆనందంగా ఉన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మార్పులు స్పష్టంగా కనిపించబోతున్నాయి. ఈ దిశగానే ఆయా పార్టీల నాయకులు ఇప్పటికే గ్రామాల పరిధిలోని వారితో సమావేశమవుతూ వచ్చే ఎన్నికల్లో మండల పదవులు ఎవరికి ఉంటే బాగుంటుందనే దానిపై చర్చిస్తున్నారు. ఇన్నాళ్లు మండలాల్లో ఆధిపత్యం చెలాయించిన నాయకులు ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలోకి వెళ్తున్నారు కాబట్టి ఇక మండల బాధ్యతలను గ్రామాల్లో ఉండే నాయకులే తీసుకోవాల్సి ఉంటుందని ముందుగానే సిద్ధం అవుతున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులపై కన్నేసిన నాయకులు గ్రామాల నాయకులతో టచ్‌లో ఉంటూ సంప్రదింపులు చేస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాగానే వీరంతా నేరుగా రంగంలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

చేవెళ్ల మండలంలో ఇలా..

చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో శంకర్‌పల్లి గతంలోనే మున్సిపాలిటీగా మారగా మిగిలిన గ్రామాలతో శంకర్‌పల్లి మండలంగా కొనసాగుతోంది. ఇప్పుడు కొత్తగా చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల ఏర్పాటుతో ఈరెండు కూడా మిగిలిన గ్రామాలతో చిన్న మండలాలుగా మారాయి. చేవెళ్ల మండలంలో మొత్తం 30 పంచాయతీలు ఉండేవి. వీటిలో ఎనిమిది గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో 22 పంచాయతీలతో చేవెళ్ల మండలం కొనసాగనుంది. గతంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇప్పుడు 12 స్థానాలకు తగ్గాయి.

మొయినాబాద్ మండలంలో ఇలా..

మొయినాబాద్ మండలం 28 గ్రామ పంచాయతీలతో కొనసాగింది. ఎనిమిది పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కావటంతో 20 పంచాయతీలతో మండలంగా కొనసాగనుంది. ఇప్పటికే అధికారులు ఈ మున్సిపాలిటీల పరిధిలో కలిసిన గ్రామాలను వదిలేసి ఎంపీటీసీ స్థానాలను కుదించారు. మొయినాబాద్ మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాలకు గాను 8 పోగా 9 మాత్రమే మిగిలాయి. ఈ మండలంలోని ప్రధాన పార్టీల ఆధిపత్య నాయకులంతా ఎక్కువగా మున్సిపాలిటీ పరిధిలోకి వెళ్లడంతో మిగిలిన గ్రామాల్లో ఉన్న ఆయా పార్టీల నాయకులు మండలం బాధ్యతలు తీసుకోనున్నారు.

అందరికీ అవకాశాలు



నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలతో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుంది. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న నియోజకవర్గం మరింతగా ప్రగతి సాధిస్తుంది. మున్సిపాలిటీల ఏర్పాటుతో రాజకీయ ముఖ చిత్రం మారి క్షేత్రస్థాయి నాయకులకు సైతం అవకాశాలు పెరుగుతాయి.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే

అభివృద్ధికి బాటలు



ప్రత్యేక ప్రణాళికతో ముందుకు..

- పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలపై దృష్టి
- వంద శాతం పన్నుల వసూలు లక్ష్యం
- ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి
- 'సాక్షి'తో చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

చేవెళ్ల: 'పారిశుద్ధ్యం.. రోడ్లు.. డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం.. మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతాం.. వందశాతం పన్నుల వసూళ్లపై ప్రణాళిక సిద్ధం చేసుకుంటాం.. కొత్త మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.. పట్టణ ముఖచిత్రాన్ని మార్చేలా అభివృద్ధికి బాటలు వేస్తాను' అంటున్నారు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ఎం.పూర్ణచందర్. 'సాక్షి'తో మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు.. ఆయన మాటల్లోనే..

అనుభవంతో అభివృద్ధికి చొరవ

2011 నుంచి భువనగిరి, వనపర్తి, నాగర్‌కర్నూల్, దేవరకొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేశాను. అక్కడి మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నాను. సర్వీస్ మరో ఏడాదిన్నర మాత్రమే ఉంది. ఆయా మున్సిపాలిటీల్లో పని చేసిన అనుభవంతో కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.

రాబోయే వేసవిపై స్పెషల్ ఫోకస్

రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ పరిధిలో ఎలాంటి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటాను. మున్సిపాలిటీపై అవగాహన కోసం అన్ని విలీన గ్రామాల్లో పర్యటిస్తున్నాను. సమస్యలు, వనరులు, అభివృద్ధి తదితర అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాను. మిషన్‌భగీరథ నీటిని ప్రతి ఇంటికీ అందేలా చూస్తాం. మున్సిపల్ పరిధిలో డంపింగ్ యార్డు కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాల్సి ఉంది. మున్సిపల్ కార్యాలయానికి ప్రత్యేక స్థలం కావాలి, దీనిపై అధికారులతో చర్చిస్తాను.

పన్నుల వసూలు.. సౌకర్యాల కల్పన

మున్సిపల్ పరిధిలోకి వచ్చిన 8 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు ఉండవు. ఇతర అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు యథావిధిగా అందుతాయి. మున్సిపల్ టౌన్ పరిధిలో వచ్చే కంపెనీల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మున్సిపాలిటీ ఏర్పాటుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. వాటితో టౌన్ అభివృద్ధి జరుగుతుంది. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. పన్నుల పెరుగుదల ఉంటుంది.. అదే స్థాయిలో సౌకర్యాల కల్పన కూడా జరుగుతుంది. ఒకేసారి పన్నులు అమాంతం పెరిగిపోతాయనేది అపోహ మాత్రమే. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో ఉన్న ప్రకారమే పన్నుల వసూళ్లు ఉంటాయి.

సమగ్ర అభివృద్ధే అంతిమ ధ్యేయం

మున్సిపాలిటీ అంటేనే ప్రత్యేక విభాగాలు ఉంటాయి. ఇందులో రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్, అకౌంట్స్, టౌన్‌ప్లానింగ్, మెప్మా, సిబ్బంది ఎస్టాబ్లిష్‌మెంట్ తదితర విభాగాలు వస్తాయి. ఆయా విభాగాల అధికారులు లక్ష్యాల మేరకు బాధ్యతగా పనిచేస్తారు. మొత్తంగా మున్సిపల్ సమగ్ర అభివృద్ధే ధ్యేయం. కొత్త మున్సిపాలిటీలో విలీనమైన 8 గ్రామాలకు సంబంధించి ఆరుగురు కార్యదర్శులు మున్సిపల్ పరిధిలోకి మారారు. ఆయా గ్రామాల్లో ఉన్న పారిశుద్ధ్య సిబ్బంది కూడా ఇక నుంచి మున్సిపల్ పరిధిలోనే ఉంటారు. పన్నుల వసూళ్లకోసం పది కలెక్షన్ మిషన్లు కొనుగోలు చేసి పది బృందాలను ఏర్పాటు చేస్తాం. ప్రత్యేకంగా వందశాతం వసూళ్లకు కృషి చేస్తాను.



ఆఫ్రికా అతిథులు

నగరంలోని నెహ్రూ జూ పార్కులో విదేశీ అతిథులు సందడి చేయనున్నాయి. అరుదైన వన్య ప్రాణులు త్వరలోనే ఇక్కడ అడుగిడనున్నాయి. జంతు మార్పిడిలో భాగంగా వీటిని ఇక్కడికి తీసుకురానున్నారు. సుమారు 16 దేశాల నుంచి తెల్ల సింహం, జీబ్రాలు, పులులు తదితర జంతువులను జూ అధికారులు రప్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆఫ్రికా నుంచి రానున్న ఈ చింపాంజీలు అలరించనున్నాయి.

25న స్టాండింగ్ కమిటీ ఎన్నిక

నేడు నోటిఫికేషన్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి 15 మంది సభ్యుల ఎన్నిక ఈ నెల 25న జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఎన్నిక షెడ్యూలు విడుదల చేశారు. ప్రస్తుతం పాలకమండలిలో సభ్యులుగా ఉన్న 146 మంది వార్డు సభ్యులు (కార్పొరేటర్లు) స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. షెడ్యూలు ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

ఎన్నిక నోటిఫికేషన్: 5–2–2025

నామినేషన్ల స్వీకరణ: ఫిబ్రవరి 10 నుంచి 17వ తేదీ వరకు. 16 తేదీ ఆదివారం మినహా మిగతా అన్ని రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.

నామినేషన్లు స్వీకరించే స్థలం: సెక్రటరీ కార్యాలయం, జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయం.

నామినేషన్ల జాబితా వెల్లడి: 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత.

నామినేషన్ల పరిశీలన: 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి.

అర్హుల తుది జాబితా: 18న పరిశీలన పూర్తయ్యాక.

నామినేషన్ల ఉపసంహరణ గడువు: 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు.

పోటీలో మిగిలిన అభ్యర్థుల జాబితా: 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత.

ఎన్నిక: 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.

ఎన్నిక జరిగే ప్రదేశం: కమిషనర్ కార్యాలయం.

ఓట్ల లెక్కింపు: 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత.

ఫలితం వెల్లడి: ఓట్ల లెక్కింపు పూర్తికాగానే.

రసవత్తరం.. బరిలో ఎవరో?

ఈసారి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ప్రస్తుత పాలకమండలి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ బీఆర్ఎస్–ఎంఐఎం మైత్రీబంధంతో స్టాండింగ్ కమిటీకి నామినేషన్లు దాఖలు చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవంగానే ఎన్నికలు జరిగాయి. పాలకమండలి ఎన్నికలప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటం, కార్పొరేటర్లు సైతం బీఆర్ఎస్ నుంచి ఎక్కువమంది గెలవడం తెలిసిందే. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం రెండు సీట్లు.. తర్వాత ఉప ఎన్నికలో ఒక వార్డు గెలుపుతో మూడు స్థానాల్లో మాత్రమే ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం జీహెచ్ఎంసీలో పార్టీల బలాలు మారాయి.

- బీఆర్ఎస్, బీజేపీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం కాంగ్రెస్ బలం 24గా ఉంది. మరోవైపు గత స్టాండింగ్ కమిటీ ఎన్నికల వరకు బీఆర్ఎస్–ఎంఐఎం మైత్రీ బంధం కొనసాగినప్పటికీ, ప్రస్తుతం ఎంఐఎం కాంగ్రెస్‌తో సఖ్యతగా ఉంటోంది. పలు సందర్భాల్లోనూ ఆ విషయం వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఈసారి బీఆర్ఎస్‌కు మద్దతిచ్చే అవకాశాలుండవని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు బీజేపీ సైతం బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ సర్వసభ్య, బడ్జెట్ సమావేశంలో ఈ అంశం వెల్లడైంది.
- సభలో గందరగోళం జరపుతూ కార్యకలాపాలకు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ సభ్యులందరినీ మార్షల్స్‌తో సభ నుంచి బయటకు పంపాక సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలో ఏయే పార్టీలు పరస్పరం సహకరించుకుంటాయి.. ఏవి మద్దతిస్తాయి.. ? ఎవరు ఎవరికి వ్యతిరేకంగా వ్యవహరించనున్నారనేది ఆసక్తికరంగా మారింది. త్వరలో గడువు ముగియనున్న స్టాండింగ్ కమిటీలో బీఆర్ఎస్ నుంచి ఎనిమిది మంది, ఎంఐఎం నుంచి ఏడుగురుండగా, ఎంఐఎం సభ్యుల్లోని ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహీన్‌బేగం మృతి చెందడంతో ఆ సీటు ఖాళీగానే ఉంది.

❖ రూలంటే.. రూలే



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి.. తనను కలిసేందుకు వచ్చేవారికి నిబంధనలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే తన పేషీలో పోలీసులు.. జీహెచ్ఎంసీ రెండు ప్రధాన ద్వారాల వద్ద సందర్శకుల రాకపోకలు తెలిసేలా టీవీలు ఏర్పాటు చేసిన కమిషనర్.. సాధారణ సందర్శకులకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య వచ్చేవారికి అవకాశం కల్పిస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు సైతం ప్రత్యేక సమయం కేటాయించారు. ప్రజాప్రతినిధులు కలిసేందుకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకని పేర్కొంటూ కమిషనర్ పేషీలో అంటించారు. సాధారణ ప్రజలు నేరుగా రాకుండా తొలుత పేషీలోకి వెళ్లే ముందే కౌంటర్‌లో ఉండే కంప్యూటర్ ఆపరేటర్ వద్ద తమ పేరు, వివరాలు, ఎందుకొచ్చిందీ వంటి వివరాలు వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలి. నమోదు కాగానే వారి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని చూపించి కమిషనర్‌ను కలిసేలా ఏర్పాట్లు చేశారు.



సరూర్‌నగర్ చెరువులో దూకిన వారిని కాపాడుతున్న హోంగార్డు ఈశ్వర్ (ఫైల్)

జీవితంపై విరక్తి చెంది.. క్షణికావేశంలో చెరువులో దూకే వారి పాలిట ఆపద్బాంధవుడయ్యాడు ఆ హోంగార్డు.. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 23 మందికి పునర్జన్మ ప్రసాదించాడు.. ఆయా కుటుంబాల్లో చీకట్లు అలుముకోకుండా కొత్త 'ఊపిరి' పోశాడు..

– మహేశ్వరం

- సరూర్‌నగర్ చెరువు కట్టపై విధులు
- చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన 23 మంది ప్రాణాలు కాపాడిన హోంగార్డు
- ధైర్య సాహసాలకు మెచ్చిన కేంద్రం
- రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక
- ఆగస్టు 15న రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అందుకోనున్న ఈశ్వర్

ఈశ్వర్.. సూపర్

సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువు కట్టపై పోలీస్ ఔట్ పోస్ట్ ఇన్‌చార్జిగా 2020 నుంచి 2023 వరకు మూడేళ్లపాటు విధులు నిర్వర్తించాడు మంత్రి ఈశ్వరయ్య అలియాస్ ఈశ్వర్. అదే సమయంలో వివిధ కారణలతో సరూర్‌నగర్ చెరువులోకి దూకి ఆత్మ హత్యకు యత్నించిన 23 మందిని రక్షించాడు. బాధితులను రక్షించే క్రమంలో కొన్నిసార్లు ప్రాణపాయం వరకూ వెళ్లాడు. అయినా వెరవకుండా చెరువులో దూకేవారి ప్రాణాలను కాపాడాడు. అతని ధైర్య సాహసాలు, సేవలకు గుర్తింపుగా కేంద్రం ప్రతిష్టాత్మక భారత రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఇటీవల ఎంపిక చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతులమీదుగా ఈశ్వర్ అవార్డు అందుకోనున్నారు.

కర్తవ్యాన్ని గుర్తు చేసుకుని..

మహేశ్వరం మండలం పెండ్యాల గ్రామానికి చెందిన ఈశ్వర్ చిన్నప్పుడు బావులు, చెరువుల్లో ఈత నేర్చుకున్నాడు. స్నేహితులతో ఈత కొట్టే సమయంలో పోటీలు పెట్టుకుని మొదటి స్థానంలో నిలిచేవాడు. 2000 సంవత్సరంలో హోంగార్డుగాఎంపికయ్యాడు. 2020లో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. చెరువు కట్టపై పోలీస్ ఔట్ పోస్ట్ డ్యూటీ వేశారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మ హత్య చేసుకోబోయాడు. కాపాడే క్రమంలో అతడు కళ్ల ముందే చనిపోయాడు. ఈ సంఘటన ఈశ్వర్‌ను కలిచివేసింది. అదే సమయంలో వివిధ కారణాలతో ఎంతోమంది చెరువులో దూకి ఆత్మ హత్య యత్నానికి పాల్పడుతుంటారని.. అలాంటి వారిని కష్టపడి రక్షించి ప్రాణాలు పోకుండా చూడాలని సీఐ సీతారామ్ చేసిన హితబోధ తన కర్తవ్యాన్ని గుర్తు చేశాయి. ఈ క్రమంలోనే రెండు రోజులకే చెరువులో దూకిన యువకుడిని కాపాడాడు. ప్రేమ విఫలమై, సంసారంలో కలతలు వచ్చి గొడవలు పడిన దంపతులను రక్షించాడు.



ఈశ్వర్‌ను సన్మానిస్తున్న మహేశ్ భగవత్

గాయాలైనా వెరవక..

చెరువులో దూకిన వారిని రక్షించే క్రమంలో కష్టంగా ఉండేది. బరువుగా ఉన్న వారిని ఒడ్డుకు తీసుకు వచ్చే క్రమంలో ఒక్కోసారి పట్టుకొని చెరువు లోపలికి లాగేవారు. చెరువులో ముళ్లు, రాళ్లు, పడేసిన సీసాల ముక్కలు కాళ్లకు తగిలి తీవ్ర గాయాలయ్యేవి. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఎప్పుడూ వెనుకడుగు వేయొద్దని, చెరువులో దూకిన వారిని ప్రాణాలతో కాపాడాలని కుటుంబ సభ్యులు, ఏసీపీ, సీఐ, ఎస్ఐలు చెప్పి ప్రోత్సహించేవారు. అలా 23 మందిని రక్షించాడు. భారత రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపికకావడంపై ఎంతో మంది పోలీస్ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈశ్వర్ ప్రస్తుతం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

బాధ్యత మరింత పెంచింది



చెరువులో దూకి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన వారిలో ప్రాణాలతో బయట పడ్డవారు ఇప్పటికీ ఫోన్లు చేసి మాట్లాడుతుంటారు. నీ వల్లే ఈరోజు బతికిబట్టకట్టామని, కొత్త జీవితాన్ని ఇచ్చావంటూ కృతజ్ఞతలు చెబుతుంటారు. వారు మాట్లాడుతుంటే నిజంగా గర్వంగా ఉంటుంది. రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది. – ఈశ్వర్

కర్షక, కార్మిక వర్గాలకు అన్యాయం

- కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్
- సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి


మాట్లాడుతున్న మాధవరెడ్డి, పక్కన నాయకులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ, శ్రామికవర్గాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ఆరోపించారు. కేవలం కార్పొరేట్లకు ఊతమిచ్చేలా ఉందన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం డాగ్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయరంగ సబ్సిడీలకు కోత విధించారని, ఎరువుల రాయితీల్లో రూ.11 వేల కోట్లు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం బడ్జెట్‌లో కేవలం 2.51 శాతమే వ్యవసాయరంగానికి కేటాయింపులు జరిగినట్లు వెల్లడించారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర ఊసే లేకపోవడం సమైక్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నిధులు రాబట్టలేకపోయాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌పై పునఃసమీక్షించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, బాల్‌రాజ్, బాల్‌రెడ్డి, రజనీకాంత్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు


మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- రేపటి నుంచి మండల సమావేశాలు

ఇబ్రహీంపట్నం: ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అందలం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ హామీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. ఉచిత రెండు వందల యూనిట్ల విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్, రైతు రుణమాఫీ నామమాత్రంగా అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు పరుస్తున్నట్లు ప్రకటనలను ఇస్తుండటం సిగ్గుచేటన్నారు. ఈ నెల 6 నుంచి మండలాల వారీగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్‌ఎస్ శ్రేణులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, నాయకులు బుగ్గరాములు, రమేశ్, కిషన్‌గౌడ్, బహదూర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, బాష, రాంరెడ్డి, చక్రవర్తిగౌడ్, కృపేశ్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, యాదయ్య, నర్సింగ్, వెంకటేశ్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీరేలా..

గండిపేట నుంచి మరో పైపులైన్



ఇప్పటికే 18 నుంచి 22 ఎంజీడీల నీటి తరలింపు

- కాండూట్ లీకేజీలతో సగానికిపైగా మధ్యలోనే వృథా
- ఒకవైపు మరమ్మతులు.. మరోవైపు రెండో పైపులైన్
- అదనపు జలాల తరలింపునకు ప్రభుత్వం పచ్చజెండా
- సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు జలమండలి కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: శతాబ్ద కాలంగా నగర దాహార్తి తీరుస్తున్న గండిపేట (ఉస్మాన్‌సాగర్) నుంచి మరో పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని తరలించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. నగరం నలుదిక్కులా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు మరింత పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జంట జలాశయాలతో పాటు కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూర్ ప్రాజెక్టుల నీటిని తరలిస్తున్నా.. అవి సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో అందుబాటులో ఉన్న వనరుల నుంచి మరిన్ని జలాలను మహా నగరానికి తరలించేందుకు జలమండలి ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ రిజర్వాయర్ వరకు మరో పైపులైన్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ వేగిరం చేసింది. ఇప్పటికే గండిపేట నుంచి కాండూట్ లైన్ ద్వారా తరలిస్తున్న జలాలు మార్గమధ్యలో లీకేజీల కారణంగా సగానికిపై వృథా అవుతున్నాయి. ఒకవైపు కాండూట్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి.. తాజాగా దాని సమాంతరంగా కింద భాగంలో పైపులైన్ వేసేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పన కోసం కసరత్తు చేస్తోంది.

14.5 కి.మీ వరకు కాండూట్ లైన్

గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ వరకు నీటిని తరలించేందుకు సుమారు 14.5 కి.మీల వరకు నేచురల్ స్లోప్‌తో రాతి కాలువ (కాండూట్)ను నిర్మించారు. తరలించిన నీటి శుద్ధి కోసం సుమారు 25 ఎంజీడీ సామర్థ్యమున్న ఫిల్టర్ బెడ్స్‌ను ఆసిఫ్‌నగర్‌లో నిర్మించారు. గండిపేట నుంచి కోకాపేట, నార్సింగి, మణికొండ, టోలిచౌకి, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు నిర్మించిన కాలువ ద్వారానే ఇప్పటి వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీన్ని వారసత్వ కట్టడంగా కూడా గుర్తించారు. గండిపేట జలాశయం పరిధిలోకి వచ్చే జీఓ 111 నిబంధనలు ఈ కాండూట్‌కు కూడా వర్తిస్తాయి. ఇక్కడి నుంచి వంద మీటర్లు ఇటూ.. అటూ ఎవరూ నిర్మాణాలు చేయకూడదని నిబంధన ఉంది.

సగానికిపైగా నీటి వృథా

గండిపేట నుంచి కాంటూన్ ద్వారా నగరానికి తలిస్తున్న నీటిలో సగం నీరు వృథా అవుతోంది. వాస్తవానికి ఈ జలాశయం నుంచి సుమారు 26 ఎంజీడీలకుపైగా తాగునీరు తరలించే అవకాశం ఉంది. ప్రస్తుతం మహానగరానికి ప్రతి నిత్యం సుమారు 20 నుంచి 22 ఎంజీడీల నీరు తరలిస్తుండగా.. కాండూట్‌కు అడుగడుగునా లీకేజీల కారణంగా దాదాపు 8 నుంచి 10 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వరకు ఉన్న సుమారు 14.5 కిలోమీటర్ల పొడవు కాండూట్‌కు దాదాపు 45 ప్రాంతాల్లో లీకేజీ సమస్య ఉంది. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా జర్మన్ టెక్నాలజీతో లీకేజీల మరమ్మతు పనులు చేస్తున్నారు. దీంతో సుమారు 1 నుంచి 2 ఎంజీడీల నీటి వృథాను అరికట్టగలిగారు.

గ్రావిటీ ద్వారా..

గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు పైసా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీటి సరఫరా అవుతోంది. ప్రస్తుతం కృష్ణా, గోదావరి జలాలు పంపింగ్ ద్వారా నీటిని తరలిస్తున్నారు. గండిపేట నుంచి మాత్రం కాండూట్ మార్గంలో సుమారు 14.5 కిలోమీటర్లు వరకు నీటి తరలింపు ఎలాంటి పంపింగ్ లేకుండా గ్రావిటీ ద్వారానే కొనసాగుతోంది. ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి అనంతరం డివిజన్ 3, 4, 5, 6 పరిధిలో వినియోగదారులకు తాగునీటి సరఫరా సాగుతోంది.

నిండు కుండలా ఉండేందుకు..

గత ప్రభుత్వం సెంటిమెంట్‌తో గండిపేట జలాశయం నిండు కుండలా ఉండేందుకు రెండేళ్లు నీటిని నిల్వలను వినియోగించలేదు. వాస్తవంగా నాగార్జునసాగర్ నుంచి మూడు దశల్లో కృష్ణా జలాలు, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలు, మరోవైపు మంజీరా, సింగూర్ జలాలు తరలిస్తుండటంతో గండిపేట నీటి వినియోగం బాగానే తగ్గింది. గత రెండేళ్ల నుంచి వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా. గండిపేట జలాశయం నుంచి నీటి తరలింపు పునఃప్రారంభమైంది. గండిపేట ఒకసారి జలాశయం భూగర్భ జలాలు, వర్షపు నీటితో నిండిందంటే 17.395 కిలోల లక్షల లీటర్లకు చేరుకుంటుందని అంచనా. వర్షపు నీటి పరిరక్షణ మాన్యువల్ అంచనా ప్రకారం 100 చదరపు మీటర్ల పోరస్ భూమిలో వార్షిక వర్షపాతం 800 మి.మీ ఉంటే సంవత్సరానికి 80,000 లీటర్ల నీటి లభ్యత ఉంటుంది. ఉస్మాన్‌సాగర్ జలాశయం నీటితో నిండి ఉంటే నగరంలోని ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్‌లోని పశ్చిమ భాగాలలోనూ భూగర్భ జలమట్టం పెరిగే అవకాశాలుంటాయి. జలాశయం ఎండిపోతే మాత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోవడం ఖాయమని నిపుణులు పేర్కొంటున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

- **KARMANGHAT** Near Main Road 200 Yards 30 Feet Road West Face G+1=2BHK +3BHK House for Sale. Ph-98852 02404 [HA-1050]

LEASE / RENT

- **5Floors Building Ladies Hostel** sutbel @ Gowrishankar colony, Rd No.10, Banjarahills, Street No.3, Hyd. 8142237799, 9701806246 [HA-1396]
- **Hotel For LEASE Sri Suprabhat** Family Restaurant. Rampally main Road, Nagaram municipality. contact : 9948364197 [SCA25001522]

LAND FOR SALE

- **నల్లగొండ జిల్లా**, నిడమనూరు మం॥, ఎర్రబెల్లి గ్రామంలో ఆరు ఎకరాల 20 గుంటల వ్యవసాయ భూమి అమ్మబడును. సంప్ర॥ సెల్: 9010914568 [SCA25001515]

PLOT FOR SALE

- **డైరెక్ట్ కం ఆఫర్ HMDA పరిధిలో** కేవలం 1లక్షకే 121 గజాలు అగ్రిమెంట్, మిగత 24 నెలల సులభ EMI, (గజం 2999/-) యాదగిరిగుట్ట రాజాపేట రోడ్డు నెమల. ఫోన్: 7842408719 [HA-8210]
- **విజయవాడ హైవే, నార్కట్‌పల్లి దగ్గర** అద్భుతమైన గేటెడ్ కమ్యూనిటీ ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, గెస్ట్‌హౌస్, ఎర్ర చందనం & పండ్ల మొక్కలతో 1210 గజాల (10 గుంటలు) ప్లాట్స్ కలవు. సంప్ర : 6304222202 [HA-1192]

Services

BUSINESS SERVICE

- మీ బంగారం మణప్పురం ముత్తూట్ మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

BUSINESS OFFER

- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

PERSONAL CARE

CHANGE OF NAME

- కరుణ దండు అనే నేను డి/ఓ మారుతి దండు, బాలానగర్, హైదరాబాద్ ఇప్పటి నుంచి నా పేరు కరుణ దండు నుంచి కరుణగా మార్చుకుంటునాను భవిశ్యత్తు కోసం [HA-41323]
- **I, Gurukula Swetha W/o.Puranam** Shivaprasad plot no.2, Aeronautics Enclave, Suchitra, Hyderabad have changed my name from Gurukula Swetha to Puranam Poojitha for all records purpose. [HA-99755]
- **I, KHARADI RAVINDRA** KUMAR S/o. PUNABHAI. Vaghpur, Tahshil Bhiloda, dist Aravalli, Gujarat State. Changed My Son name from KHARADI PRINSES KUMAR to New Name KHARADI PRATYUSH KUMAR RAVINDRA KUMAR [SCA25001521]

OLD AGE HOME

- వృద్ధులు, **NRI'S**, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాననున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783367]

Wanted

- జంటనగరాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి, మంచి జీతం కలదు. సంప్రదించండి : 9392663777, 9246663777 [HA-1395]
- రియల్ ఎస్టేట్ Co.HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. జీ+కమీషన్+ 2వీలర్+రూం+భో ఫ్రీ, Age:30, నె.లక్ష రూ.ఫ్రెష్/Exp. Ph: 7416396781 [HA-15432]
- వంట, ఇంటి పని, పిల్లలను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్ టేకర్స్ పంపబడును. 6309807798, 9121099519 స్త్రీ/పు వర్కర్స్ కావలెను. [SCA25001474]
- ఇంట్లోనే ఉండి ఇంటి, వంటపనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్ళు కావలెను. జీ: 15-25k హౌస్ కీపింగ్ బాయ్స్‌కా Ph: 8019373131/ 040 45043410 [HA-800524]
- **MG కార్ షోరూం శంషాబాద్‌లో** పని చేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, సర్వీస్ సూపర్ వైజర్, మెకానిక్స్ కావలెను. సెల్ : 9492628629, 9491402020. [J-521]
- **ఒమేగా హోంకేర్‌లో** వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [SCA25001467]
- **క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో** నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-1]
- **Wanted Receptionist to work** in Hyd, Telugu, Hindi, English speaking. Age 25 to 45yrs. Good Salary. Contact: 9121976034. [HA-15133]
- **Lady Accoutant 2-3yr Exp, Sale** Sexecu(2) M/F Driving License Must Sal: 15k-22k Mahesh Enterprises, HP Rd. Moosapet, 9246585109 [SCA25001512]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

మునగకాయలు కోస్తుండగా ప్రమాదం


రజిని మృతదేహం

మొయినాబాద్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరన్నపేటలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా, వేమూరు గ్రామానికి చెందిన సుబ్బారావు, అతని భార్య రజిని(52) కొంతకాలంగా వీరన్నపేటలోని రాజ్‌కుమార్ ఫాం హౌస్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో రజిని కొడవలితో మునగకాయలు కోస్తుండగా పైనుంచి ఉన్న విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురైంది. వెంటనే ఆమెను స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

నిందితుల రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌ఓటీ, పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల ఏరోస్పేస్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆనంద్‌కుమార్ శర్మ(29), అవినాష్ యాదవ్(20)లు గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. వీరి వద్ద 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీని విలువ రూ.37,500 ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ రూరల్: నర్కూడ శివారులోని అమ్మపల్లి (సీతారామచంద్ర స్వామి) ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

రాచకొండ ఐటీ సెల్ పనితీరు భేష్

సాక్షి, సిటీబ్యూరో: సంక్లిష్టమైన కేసులను ఛేదించడంలో రాచకొండ ఐటీ సెల్ కీలక పాత్ర పోషిస్తున్నదని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం సోషల్ మీడియా, సీసీటీఎన్‌ఎస్, కోర్ టీమ్, సీఐఆర్, ప్రజావాణి ఫిర్యాదుల వంటి పలు విభాగాల పనితీరుపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య, ఆస్తి తగాదాలు, చైన్ స్నాచింగ్, వాహన, మొబైల్ దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల వంటి పలు కేసులను త్వరితగతిన ఛేదించడంలో సాంకేతికంగా అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. సమర్థవంతమైన పనితీరుతోనే అసలైన నిందితులను వీలైనంత తక్కువ సమయంలోనే పట్టుకోవడం సాధ్యమైందన్నారు. సీసీ టీవీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజల్లో మరింతగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇప్పటికే అమర్చిన కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. నేర శాతాన్ని తగ్గించడానికి రాచకొండ పోలీసులు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను సామాజిక మాధ్యమాల్లో మరింతగా ప్రచారం చేయాలని, కళాశాలల్లో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో ఎంతో ముఖ్యమైన ఐటీ సెల్‌ను సాంకేతికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

మైలార్‌దేవ్‌పల్లి: వేసవిలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ శ్రీరామ్మోహన్ తెలిపారు. మంగళవారం శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో డీఈ రత్నాకర్‌రావు అధ్యక్షతన అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు ఈశ్వర్‌ప్రసాద్, సత్యనారాయణ, రమేష్‌తో కలిసి ఆయన వేసవిలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పర్యవేక్షించేందుకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వినియోగదారులు తమ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను ఆయా ప్రాంతాల్లో గల అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు.

కూల్ జర్నీ

వేసవికి మరిన్ని ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు

- మార్చి నాటికి 100 కొత్త సర్వీసులు
- అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న ఆర్టీసీ
- దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణ



సాక్షి, సిటీబ్యూరో: సిటీ బస్ కూల్ జర్నీ.. వేసవిలో నగరవాసులకు చల్లటి ప్రయాణ సదుపాయాన్ని అందజేసేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. మార్చి నాటికి గ్రేటర్‌లో అందుబాటులోకి రానున్న సుమారు 286 ఎలక్ట్రిక్ బస్సుల్లో 100కు పైగా ఏసీ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు 90 ఏసీ మెట్రో లగ్జరీ బస్సులు ఉన్నాయి. సికింద్రాబాద్, కూకట్‌పల్లి, బేగంపేట్, జేబీఎస్ తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా ఈ బస్సులు తిరుగుతున్నాయి. హైటెక్ సిటీ, ఐటీ కారిడార్‌లతో పాటు వివిధ ప్రాంతాల మధ్య నడుస్తున్న ఏసీ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో వేసవిలో మరిన్ని ప్రాంతాలకు ఏసీ బస్సులను విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మరికొన్నింటిని అద్దె ప్రాతిపదికన తీసుకొని నడిపేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే నగరంలోని వివిధ మార్గాల్లో 254 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయి. హయత్‌నగర్-2 డిపోలో కొత్తగా 45 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారు.త్వరలో మరో 286 బస్సులను సిటీలో ప్రవేశపెట్టనున్నారు.దీంతో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 530 కి చేరనుంది. దశలవారీగా గ్రేటర్ పరిధిలోని 28 డిపోల్లో డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ అద్దె బస్సులు రానున్నాయి. కాలుష్య, పర్యావరణహిత ప్రజారవాణా సదుపాయంలో భాగంగా కూల్ జర్నీ కూడా అందుబాటులోకి రానుంది.

సిటీలో ఆర్టీసీ

మొత్తం డిపోలు:	28
ప్రస్తుతం బస్సుల సంఖ్య :	2,800 (సుమారు)
ఎలక్ట్రిక్ బస్సులు (ఆర్డినరీ) :	74
మెట్రో ఎక్స్‌ప్రెస్ :	80
మెట్రో లగ్జరీ ఏసీ :	90
ఆర్టీసీ రూట్లు :	1,100 (సుమారు)
ప్రయాణికుల సంఖ్య:	20 లక్షలు

ప్రయాణికుల సంఖ్య పెంచడమే లక్ష్యం..

మహాలక్ష్మి పథకంతో నగరంలో పురుష ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 20 లక్షల మంది సిటీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 14 లక్షల మంది వరకు మహిళలే ఉన్నట్లు అంచనా. దీంతో ఆర్టీసీకి టికెట్లపై నగదు రూపంలో ఆదాయం లభించడం లేదు. మహిళలకు ఇచ్చే జీరో టికెట్లపై ప్రభుత్వం విడుదల చేసే నిధులు మాత్రమే ఆర్టీసీ ఖాతాలోకి చేరుతున్నాయి. నగదు కొరత కారణంగా రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు సమానంగా మెట్రో డీలక్స్, మెట్రో ఏసీ లగ్జరీ బస్సులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. దీంతో పురుష ప్రయాణికుల సంఖ్య పెరిగి టికెట్ విక్రయాలపై రోజువారీ ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

కిలోమీటర్‌కు రూ.57 చొప్పున అద్దె..

ఎలక్ట్రిక్ అద్దె బస్సుల నిర్వహణతో ఆర్టీసీకి ఎలాంటి సంబంధం ఉండదు. వాటికి డిపోల్లో చార్జింగ్, మౌలిక సదుపాయాలు కల్పించడం వరకే ఆర్టీసీ పరిమితమవుతుంది. ఎలక్ట్రిక్ ఏసీ, నాన్ ఏసీ బస్సులపై ఆర్టీసీకి వచ్చే ఆదాయంలో కిలోమీటర్‌కు రూ.57 చొప్పున ప్రైవేట్ సంస్థలకు చెల్లిస్తారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందజేసే ఆర్థిక ప్రోత్సాహంలో భాగంగా ఒక్కో బస్సుకు రూ.35 లక్షల సబ్సిడీ లభించనుంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణకు అవకాశం ఏర్పడింది. వచ్చే మూడేళ్లలో నగరంలో సుమారు 2800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో కనీసం 40 శాతం వరకు ఏసీ బస్సులు ఉండే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం నగరంలోని డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించనున్నారు.

భౌతికశాస్త్రంలో పురస్కారం


హరికుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: భౌతికశాస్త్రం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా అందజేసే ఉత్తమ పరిశోధన పురస్కారం (2024) నామ హరికుమార్‌ను వరించింది. ప్రస్తుతం ఆయన సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగం హెచ్‌ఓడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పరిశోధనా పుర్కసారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. 2024లో హరికుమార్ రాసిన వ్యాసాలు స్కోపస్ సైన్స్ ఇండెక్స్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆయన శ్రమను గుర్తించిన పరిశోధనా సంఘం ఈ పురస్కారాన్ని బహూకరించింది. కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బంది, సహచరులు హరికుమార్‌ను అభినందించారు.

నియామకం


నియామకపత్రం అందుకుంటున్న అమీర్‌పాషా

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణం తిరుమల కాలనీకి చెందిన ఎండీ. అమీర్‌పాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఈ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఫారూఖ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లాకొత్వాల్ చేతుల మీదుగా అమీర్‌పాషా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి ఎస్‌ఎ.వాహీద్‌షాఖాద్రి తదితరులు పాల్గొన్నారు

గంజాయి పెడ్లర్ అరెస్ట్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న పెడ్లర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 56.28 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ జావేద్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన లక్ష్మణ్ సాంబాజి వృత్తిరీత్యా రైతు కూలి. ట్రైన్ యాక్సిడెంట్‌లో 2006 సంవత్సరంలో ఎడమ చేయి విరిగింది. ఈ క్రమంలో ఈజీ మనీకి అలవాటు పడిన లక్ష్మణ్ గంజాయి రవాణా చేస్తూ డబ్బులు సంపాదించేవాడు. మహారాష్ట్రకు చెందిన మనోరంజన్ దాస్ అనే వ్యక్తితో ట్రిప్‌కు రూ.5 వేల చొప్పున ఒప్పందం కుదుర్చుకొని ఇప్పటికే మూడు సార్లు ఒడిశాలోని ఛత్రాపూర్ నుంచి మహారాష్ట్రలోని పుణేకు అక్రమంగా గంజాయి తరలించాడు. అదే విధంగా ఈ నెల 2వ తేదీన ఛత్రాపూర్ నుంచి పూణేకు గంజాయి తరలించేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ కోచ్‌లో ఎక్కాడు. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మూడు బ్యాగుల గంజాయిని లక్ష్మణ్‌కు ఇచ్చాడు. ఈ నెల 3న ఉదయం 11.30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫామ్ నంబర్ 10కి రైలు చేరుకుంది. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా రైల్వే పోలీసులు అనుమానస్పదంగా కనిపిస్తున్న ప్రయాణికుల బ్యాగులు సోదా చేస్తుండగా లక్ష్మణ్ వద్ద సుమారు రూ.14.07 లక్షల విలువగల 56.28 కిలోల గంజాయి లభించింది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకొని పెడ్లర్ లక్ష్మణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ సరస్వత్, ఎస్‌ఐ రమేష్, ఆర్పీసీ వెంకటేశ్వర్, ఎస్‌ఐ నజీమా బేగం, శక్తి టీమ్ లావణ్య, వందన సింగ్, మాధురి సింగ్, సుధ పాల్గొన్నారు.